

పీచు మిఠాయి నిషేధం

పెరంబూర్, ఫిబ్రవరి 17: క్యాన్సర్ కారక పదార్థాలున్నట్లు నిర్ధారణ కావడంతో పీచు మిఠాయి విక్రయాలపై రాష్ట్రప్రభుత్వం నిషేధం విధించింది. ఆహార భద్రతా శాఖ సిఫారసులతో రాష్ట్రప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పర్యాటక ప్రాంతాలు, బీచ్‌లు, ప్రజల అధికంగా గుమిగూడే ప్రాంతాల్లో తెలుపు, నీలం రంగుల్లో పీచు మిఠాయి ప్యాకెట్లు విక్రయిస్తున్నారు. ఈ పీచు మిఠాయి తియ్యగా, నోటిలో వేసుకొంటే కరిగిపోయే స్థితి ఉండడంతో పిల్లలు, యువతీ, యువకులు వీటిని తీసుకొనేందుకు ఇష్టపడుతుంటారు. ఇటీవల పుదుచ్చేరి బీచ్‌లో విక్రయిస్తున్న పీచు మిఠాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న ఆ రాష్ట్ర ఆహార భద్రతా శాఖ అధికారులు.. వాటి శాంపిళ్లను పరిశోధనల కోసం ల్యాబ్‌కు పంపించారు. క్యాన్సర్ వ్యాధికి కారణమయ్యే 'రొడమైన్ బి' అనే రసాయనం కలుపుతున్నట్లు పరీక్షలో నిర్ధారణ అయింది. దీంతో, ఆ రాష్ట్రంలో పీచు మిఠాయి విక్రయాలకు తాత్కాలిక నిషేధం విధించిన పుదుచ్చేరి ప్రభుత్వం, పీచు మిఠాయి తయారీ ఆహార భద్రత శాఖ నుంచి 'నో అబ్జెక్షన్' సర్టిఫికెట్ పొంది విక్రయాలు చేపట్టవచ్చని ఆదేశించింది.

మెరీనా బీచ్‌లో...

మెరీనా బీచ్‌లో విక్రయిస్తున్న పీచు మిఠాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న అధికారులు, వాటి నమూనాలను పరిశోధనలకు పంపిన నేపథ్యంలో, ఈ పీచు మిఠాయిలో కూడా క్యాన్సర్ వ్యాధికి కారణమైన రొడమైన్ బి రసాయనం కలుపుతున్నట్లు నిర్ధారణ అయింది. ఈ విషయమై ఆహార భద్రతా శాఖ సిఫారసులతో రాష్ట్రంలో పీచు మిఠాయి విక్రయాలకు నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రప్రభుత్వం, నిబంధనలు ఉల్లంఘించి విక్రయిస్తే కఠినచర్యలు చేపడతామని హెచ్చరించింది.

జౌళి రంగంలో వాడే రసాయనం.

ఆహార భద్రతా శాఖ అధికారి సతీష్‌కుమార్ మాట్లాడుతూ... రొడమైన్ బి రసాయం జౌళి రంగానికి సంబంధించిన వృత్తిలో వినియోగిస్తారన్నారు. ఇలాంటి రసాయనాన్ని పీచు మిఠాయిలో వినియోగిస్తున్నారని తెలిపారు. సాధారణంగా తినుబండారాల్లో ఉంటే రసాయనాలు 24 గంటల్లో మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతాయని, కానీ రొడమైన్ బి రసాయనం శరీరం నుంచి బయటకు వెళ్లేందుకు 45 రోజులు పడుతుందన్నారు. ఈ రసాయనం కిడ్నీ, కాలేయం, నాడీ వ్యవస్థ, మెదడు తదితరాలపై ప్రభావం చూపుతుందన్నారు. శరీరానికి రక్షణగా ఉండే పరమాణువులను నిర్వీర్యం చేసే గుణం ఈ రసాయనంలో ఉందని, అందువల్ల అలాంటి తినుబండారాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

టపాసుల ఫ్యాక్టరీలో పేలుడు



కూలిన గదులు

- ఆలంకుళంలో పదిమంది కార్మికుల దుర్మరణం
- 8 మందికి గాయాలు
- 4 గదులు నేలమట్టం
- సీఎం స్టాలిన్ సంతాపం



చెల్లాచెదురుగా పడి ఉన్న భవన గోడలు

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా ఆలంకుళం సమీపంలోని బాణసంచా కర్మాగారంలో శనివారం మధ్యాహ్నం జరిగిన పేలుడులో నలుగురు మహిళలు సహా 10 మంది దుర్మరణం చెందారు. ఎనిమిదిమంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆ కర్మాగారంలోని నాలుగు గదులు నేలమట్టమయ్యాయి. ఈ సంఘటన పట్ల ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబీకులకు సంతాపం ప్రకటించారు. శివకాశి కార్నేశన్ ప్రాంతానికి చెందిన విఘ్నేష్.. ఆలంకుళం సమీపం రాముదేవన్ పట్టి వద్ద పొలాల నడుమ పెద్ద బాణ సంచా కర్మాగారాన్ని నడుపుతున్నారు. నాగపూర్‌లోని కేంద్ర పెట్రోలియం పేలుడు వస్తువుల నియంత్ర శాఖ అనుమతిని పొంది నడుపుతున్న ఆ కర్మాగారంలో రోజూ 150 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు. ఆ కర్మాగారంలోని 74 గదుల్లో ఫ్యాన్సీరకం టపాకాయలు తయారు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం కార్మికులు టపాకాయల తయారీ పనుల్లో నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఓ గదిలో ఫ్యాన్సీరకం టపాకాయాల కోసం రసాయనాలు కార్మికులు కలుపుతుండగా ఉన్నట్టుండి నిప్పురవ్వలు వెలువడి గదిలో ఉన్న టపాకాయాలపై పడ్డాయి. దీనితో ఆ టపాకాయలకు నిప్పంటుకుని పెద్ద శబ్దంతో పేలాయి. దీంతో ఆ గది, దాని పక్కనే ఉన్న మూడు గదుల్లో టపాకాయలన్నీ ఒక్కసారిగా పేలి నేలమట్టమయ్యాయి. ఇలా నాలుగు గదులు నేలమట్టం కావటంతో ఆ గదులలో పనిచేస్తుండిన నలుగురు మహిళలు సహా 10 మంది కార్మికులు దుర్మరణం చెందారు. ఎనిమిదిమంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక దళం సభ్యులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్ సాయంతో భవన శిథిలాలను తొలగించి పది మంది మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం శివకాశి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రమేష్, కరుప్పసామి, అభయరాజ్, ముత్తు, అంబిక, మురుగజ్యోతి, శాంత సహా 10 మంది ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. సాత్తూరు, శివకాశి, వెంబకోట ప్రాంతాల నుండి వచ్చిన అగ్నిమాపక దళం సభ్యులు శిథిలాల తొలగింపు పనులు చేపట్టారు. గాయపడిన ఎనిమిది మంది కార్మికులను శివకాశి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఆలంకుళం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

మృతుల కుటుంబాలకు తలా రూ.3లక్షల సాయం...

ఆలంకుళం బాణసంచా కర్మాగారంలో జరిగిన పేలుడులో నలుగురు మహిళలు సహా 10 మంది మృతి చెందటంపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతి చెందారు. మృతుల కుటుంబీకులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మృతి చెందిన కార్మికుల కుటుంబీకులకు తలా రూ.3లక్షల చొప్పున ఆర్థికసాయం అందించనున్నట్లు ప్రకటించారు. ఆసుపత్రిలో చికిత్సలందుకుంటున్న ఎనిమిది మంది కార్మికులకు రూ.లక్ష చొప్పున ఆర్థికసాయంగా అందించనున్నట్లు తెలిపారు.



మద్రాసు విశ్వవిద్యాలయ బ్యాంకు ఖాతాల స్తంభన

పెరంబూర్, ఫిబ్రవరి 17: మద్రాసు విశ్వవిద్యాలయానికి సొంతమైన 36 బ్యాంకు ఖాతాలను ఆదాయపు పన్ను శాఖ స్తంభింపజేసింది. ఈ వర్శిటీ 2017-18 నుంచి 2020-21 వరకు ఆదాయపు పన్ను శాఖకు రూ.424 కోట్లు చెల్లించాల్సి ఉందని సమాచారం. బకాయిలు చెల్లించకపోవడంతో వర్శిటీకి చెందిన 37 ఖాతాలను ఐటీ స్తంభింపజేసింది. బ్యాంక్ ఖాతాల స్తంభనతో ప్రొఫెసర్లు, సిబ్బందికి వేతనాలు, పింఛన్ అందించలేని పరిస్థితి నెలకొంది.

అనుమతి కోరుతూ లేఖ...

మద్రాసు విశ్వవిద్యాలయం బ్యాంక్ ఖాతాల స్తంభనపై ఉన్నత విద్యాశాఖ చర్యలు చేపట్టింది. బ్యాంక్ ఖాతాలు వినియోగించుకొనేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆదాయపు పన్ను శాఖకు లేఖ రాసినట్లు అధికారులు తెలిపారు. కాగా, మద్రాసు వర్శిటీ బ్యాంక్ ఖాతాలు స్తంభింపజేసిన ఐటీ తీరుతో ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయమై రాష్ట్రప్రభుత్వం సత్వరం స్పందించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన నిర్వహించారు.

ద్రావిడ తరహా పాలనంటే ఎందుకంత మంట

- నిర్మలా సీతారామన్‌పై స్టాలిన్ ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ప్యారీస్, ఫిబ్రవరి 17: ద్రావిడ తరహా పాలనంటే కేంద్ర ప్రభుత్వానికి ఎందుకంత మంట అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సూటిగా ప్రశ్నించారు. చెన్నైలో శనివారం ఉదయం మైనార్టీల సంక్షేమంపై స్టాలిన్ నేతృత్వంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమం కోసం 18 వసతి గృహాలు అందుబాటులో ఉన్నాయని, ఐదు జిల్లాల్లో విద్యా కార్యాలయాలు పని చేస్తున్నాయని, ఈరకంగా వీరి సంక్షేమం కోసం ద్రావిడ మోడల్ ప్రభుత్వం పలు పథకాలను అందిస్తోందన్నారు. అయితే ఈ వాస్తవాలు తెలీక కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ద్రావిడ మోడల్ వేర్పాటువాదం రెచ్చగొట్టే ఉందంటూ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ముస్లింలకు 3.5 శాతం రిజర్వేషన్ కల్పించడమే కాకుండా ఇస్లామీయ మతగురువులు, వక్ఫ్ బోర్డులో పనిచేస్తున్న ఉద్యోగులకు రూ.5.46 కోట్లతో సైకిళ్ల పంపిణీ చేశామని, మసీదులు, దర్గాలకు వర్తింపజేసిన రాయితీ రూ.10 కోట్లుగా పెంచామని, రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికి యేటా నిధులు కూడా అందజేస్తున్నామని, ఇదంతా ద్రావిడ మోడల్ ప్రభుత్వం వల్లే సాధ్యమైందన్నారు. జైళ్లలో బంధీలుగా ఉన్న ముస్లిం ఖైదీలను విడుదల చేయాలంటూ అసెంబ్లీలో రాష్ట్రప్రభుత్వం ఆమోదించిన తీర్మానానికి సంబంధించిన ఫైలు గవర్నర్‌కు పంపించామని తెలిపారు. జిల్లాల హాజీలకు నెలకు రూ.20 వేలు పంపిణీ చేస్తున్నామని, ఒక్క ఇస్లామీయులకు మాత్రమే కాకుండా రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలను సమానంగా చూస్తూ పథకాలు అమలు చేస్తుంటే కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అవాస్తవాలు వెల్లడించడం హాస్యాస్పదంగా ఉందని సీఎం స్టాలిన్ పేర్కొన్నారు.

మినీ టైడల్ పార్కు ప్రారంభోత్సవం



సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఐటీ టవర్‌ను ప్రారంభిస్తున్న సీఎం

విల్లుపురం జిల్లా వానూరు తాలూకా తిరుచిట్రంబలంలో రూ. 31 కోట్లతో నిర్మించిన మినీ టైడల్ పార్కును సీఎం స్టాలిన్ ప్రారంభించారు. సచివాలయంలో శనివారం ఉదయం ఏర్పాటైన కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖల ఆధ్వర్యంలో టైడల్ నియో లిమిటెడ్ సహకారంతో 500 మంది సాంకేతిక నిపుణులు పనిచేయడానికి అనువుగా నాలుగు అంతస్థులతో నిర్మించిన ఆ మినీ టైడల్ పార్కును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ప్రారంభించారు. 63 వేల చదరపుటడుగుల విస్తీర్ణంలో ఈ టైడల్ పార్కును నిర్మించినట్లు ఆయన తెలిపారు. ఈ పార్కు ద్వారా విల్లుపురం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతకు ఉద్యోగవకాశాలు మెరుగవుతాయని ఆయన వివరించారు. ఇక కొత్త మినీటైడల్ పార్కులో తొలి కేటాయింపు సంస్థగా ఎస్‌యూపీ స్టార్టప్ స్పేస్ సంస్థ నిర్వాహకుడు ఎస్.యువరాజ్‌కు కేటాయింపు పత్రాన్ని అందజేశారు. పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖల కార్యదర్శి వి. అరుణ్ రాయ్, టీడ్కో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ నందూరి, టైడల్ పార్క్ మేనేజింగ్ డైరెక్టర్ వి. జయచంద్ర భానురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిలో రూ.59.67 కోట్లతో ఐటీ టవర్...

సచివాలయంలో ఏర్పాటైన మరో కార్యక్రమంలో తిరుచ్చి జిల్లా నావల్‌పట్టిలో రూ.59.97 కోట్లతో నిర్మించిన ఐటీ టవర్‌కు కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు. నావల్‌పట్టిలో ఎల్కాట్‌కు చెందిన 147.61 ఎకరాల విస్తీర్ణం కలిగిన స్థలంలో రూ.80.55 కోట్ల వ్యయంతో ఎల్‌కో సెజ్‌ను రూపొందించారు. ఆ సెజ్‌లో 123.23 ఎకరాల స్థలంలో ఐటీ భవనాలను వరుసగా నిర్మిస్తున్నారు. ఆ మేరకు రకొత్తగా 1.16 లక్షల చదరవుపుటడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఐటీ టవర్‌ను సచివాలయం నుండి ప్రారంభించారు. మంత్రి పళనివేల్ త్యాగరాజన్, ఐటీ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి దీరజ్‌కుమార్, రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ అనీష్ శేఖర్, తిరుచ్చిలో ఏర్పాటైన ప్రారంభోత్సవ సభలో ఆ జిల్లా కలెక్టర్ ఎం. ప్రదీప్‌కుమార్, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.15.34 కోట్లతో అగ్నిమాపక శాఖ భవనాలు...

రాష్ట్ర అగ్నిమాపక, విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో రూ.15.34 కోట్లతో నిర్మించిన కొత్త భవనాలకు సీఎం ప్రారంభించారు. తిరువణ్ణామలై జిల్లాలో 13 క్వార్టర్లు, కడలూరు, తూత్తుకుడిలో రెండు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కార్యాలయ భవనాలు, కరూరు జిల్లా అరవకురిచ్చిలో, రాణిపేట జిల్లా రాణిపేటలో, విరుదునగర్ జిల్లా రాజపాళయంలో, తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోవిల్‌లో నాలుగు అగ్నిమాపక కేంద్రాల భవనాలకు ఆయన ప్రారంభించారు. హోంశాఖ ప్రధాన కార్యదర్శి పి. అముద, రాష్ట్ర పోలీసు గృహనిర్మాణ సంస్థ చైర్మన్ ఏకే విశ్వనాథన్, అగ్నిమాపక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మీనాక్షి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

36 ఆలయాల్లో అభివృద్ధి పనులు...

రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రంలోని 36 సుప్రసిద్ధ ఆలయాల్లో రూ.592 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కూడా సీఎం శంకుస్థాపన చేశారు. 36 ఆలయాల్లో రాజగోపురాలు, కల్యాణమండపాలు, భక్తులకు వసతి గృహాలు, తలనీలాలు సమర్పించే కట్టడాలు, ఆలయ సిబ్బంది వసతి గృహాలు, కడలూరు వద్ద వళ్లలార్ అంతర్జాతీయ కేంద్రం తదితర భవనాలను నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పీకే శేఖర్‌బాబు, దేవాదాయ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే మణివాసన్, హిందూ దేవాదాయ శాఖ ప్రత్యేక అధికారి జే కుమారగురుబరన్, కమిషనర్ కేవీ మురళీధరన్, చీఫ్ ఇంజనీర్ పి.పెరియసామి తదితరులు పాల్గొన్నారు.

రూ.16 కోట్లతో కోయంబేడు పూల మార్కెట్లో ఆధునిక పార్కు

- టెండర్లు ఆహ్వానించిన సీఎండీఏ

పెరంబూర్, ఫిబ్రవరి 17: స్థానిక కోయంబేడు పూల మార్కెట్ ప్రాంగణంలో 9 ఎకరాల్లో ఆధునిక వసతులతో పార్కులను రూ.16.5 కోట్లతో ఏర్పాటు చేసేందుకు సీఎండీఏ టెండర్లు ఆహ్వానించింది. 1996లో 295 ఎకరాల్లో ఏర్పాటు చేసిన కోయంబేడు మార్కెట్ ఆసియాలోనే అతి పెద్ద మార్కెట్‌గా పేరుగాంచింది. చెన్నై నగరాభివృద్ధి సంస్థ (సీఎండీఏ) పర్యవేక్షణలో ఈ మార్కెట్ పలు వసతులు కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో, మార్కెట్ ప్రాంగణంలో పూల మార్కెట్ సమీపంలో హరిత పార్కు ఏర్పాటుచేయాలని సీఎండీఏ నిర్ణయించింది. 9 ఎకరాల్లో రూ.16.50 కోట్లతో నిర్మించనున్నారు. పచ్చికబైళ్లు, చిన్న కొలను, క్రీడా మైదానం, పిల్లలకు ప్రత్యేక క్రీడా మైదానం, ఓపెన్ ఆడిటోరియం, వాకింగ్ ట్రాక్‌ను నాలుగు నెలల్లో నిర్మించనున్నారు.



కోయంబేడులోని పూల మార్కెట్

బీజేపీ గూటికి విజయధరణి సహా ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు?



కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయధరణి

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పార్టీ అధిష్ఠానంపై అలకపాన్పు పాటిస్తున్న విజయధరణి సహా ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు త్వరలో బీజేపీలో చేరనున్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. కన్నియాకుమారి జిల్లా విలవంగోడు శాసన సభ నియోజకవర్గం నుంచి మూడు సార్లు గెలిచిన విజయధరణి ప్రస్తుతం పార్టీ విప్‌గా వ్యవహరిస్తున్నారు. గత కొంతకాలంగా ఆమె పార్టీ అధిష్ఠానంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తొలుత ఈమె టీఎన్‌సీసీ అధ్యక్షపదవి కోసం తీవ్ర ప్రయత్నాలు సాగించారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో తనకు ఎంపీ టికెట్ ఇవ్వాలని పావులు కదిపారు. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఎవరికీ ఎంపీ టికెట్లు ఇచ్చే ప్రసక్తి లేదని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ నేతలు ఆమెకు స్పష్టం చేశారు. దీనితో గత కొద్ది రోజులుగా ఢిల్లీలో మకాంపెట్టారు. బీజేపీ జాతీయ నాయకులతో ఆమె మంతనాలు సాగిస్తున్నట్లు ఊహాగానాలు చెలరేగుతున్నాయి. ఈ విషయమై ఆమెను విలేకరులు ప్రశ్నించినప్పుడు ఆ వందతులను ఖండించలేదు. బీజేపీలో చేరనున్నట్లు ధ్రువీకరించనూ లేదు. అదే సమయంలో విజయధరణితో బీజేపీ నేతలు కూడా చర్చిస్తున్నట్లు తెలిసింది. బీజేపీలో చేరితే ఆమెకు రాష్ట్రస్థాయిలో కీలక పదవిని కట్టబెడతామని హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. ఈ నెలాఖరులో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై పాదయాత్ర ముగింపు సభలో పాల్గొనేందుకు విచ్చేయనున్న ప్రధాని నరేంద్రమోదీ సమక్షంలో విజయధరణి బీజేపీ తీర్థం పుచ్చుకోవటం ఖాయమని తెలుస్తోంది. ఆమెతోపాటు మరో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు వార్తలు వెలువడుతున్నారు. ఆ ఇద్దరు శాసనసభ్యులు బీజేపీ వైపు కన్నెత్తి చూడకుండా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తీవ్ర నిఘా వేస్తున్నట్లు సత్యమూర్తి భవన్ వర్గాల ద్వారా తెలుస్తోంది.

కర్ణాటకలో మంకీ ఫీవర్ వ్యాప్తి

రాష్ట్ర సరిహద్దులో పెరిగిన వైద్యపరీక్షలు

ప్యారీస్, ఫిబ్రవరి 17: కర్ణాటకలో మంకీ ఫీవర్ వ్యాప్తి అధికంగా ఉన్న నేపథ్యంలో, తమిళనాడు - కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు వైద్యపరీక్షలు తీవ్రతరం చేశారు. కర్ణాటక రాష్ట్రం షిమోగా, ఉత్తిరకండ, చిక్ మగళూరు తదితర జిల్లాల్లో 53 మందికి మంకీ ఫీవర్ సోకింది. ఈ నేపథ్యంలో, తమిళనాడు - కర్ణాటక సరిహద్దులోని పాలారు అటవీప్రాంతం మీదుగా ప్రతిరోజూ వేలాదిమంది రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్నారు. అందువల్ల ముందస్తు చర్యల్లో భాగంగా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన కారైక్కాడు చెక్‌పోస్ట్ వద్ద వైద్యులు, సిబ్బంది, వైద్య పరీక్షలు చేపట్టారు. జ్వరం లక్షణాలు లేని వారిని రాష్ట్రంలోని అనుమతిస్తుండగా, లక్షణాలున్న వారికి వైద్య చికిత్సలందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



కారైక్కాడు చెక్‌పోస్ట్‌లో వైద్య పరీక్షలు చేపడుతున్న వైద్య సిబ్బంది

సమాచార దర్శిని

కాశీ తమిళ సంగమం పోటీ విజేతల జాబితా విడుదల

ఐసిఎఫ్, ఫిబ్రవరి 17: కాశీ తమిళ సంగమం పోటీ విజేతల జాబితా విడుదలైంది. రాజ్‌భవన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థుల విభాగంలో నలుగురు, రైతులు, హస్తకళాకారుల విభాగంలో ముగ్గురు, వర్తకుల విభాగంలో ముగ్గురు, రచయితల విభాగంలో నలుగురు, ఉపాధ్యాయుల విభాగంలో ఐదుగురు, ఆధ్యాత్మిక విభాగంలో ముగ్గురు, వృత్తుల విభాగంలో ముగ్గురు ఎంపికయ్యారు. మార్చిలో రాజ్‌భవన్‌లో జరిగే కార్యక్రమంలో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను గవర్నర్ అందించనున్నారు.

24నుంచి నవగ్రహ ప్రత్యేక బస్సు సేవలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 17: కుంభకోణం నుంచి బయల్దేరి ఒకే రోజున కుంభకోణం, చుట్టుపక్కల ఉన్న నవగ్రహ క్షేత్రాలకు ఒకే బస్సులో ప్రయాణించి మళ్లీ యథాస్థానానికి వచ్చి చేరేలా ఈ నెల 24వ తేది నుంచి ప్రత్యేక బస్సు సేవలు ప్రారంభించనున్నట్లు రవాణా శాఖ వెల్లడించింది. ప్రతి శని, ఆదివారాల్లో నడిపే ఈ సర్వీసుల్లో ఒకరికి రూ.750, ముగ్గురికి రూ.2,250 రుసుము నిర్ణయించారు. www.tnstc.in అనే యాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చు.

నేడు డాగ్ షో

ఐసిఎఫ్, ఫిబ్రవరి 17: కోవై మాంచెస్టర్ కెనాల్ క్లబ్ ఆధ్వర్యంలో అవినాశి రోడ్డు హిందుస్తాన్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం డాగ్ షో జరుగనుంది. ఈ షోలో వివిధ జాతులకు చెందిన పెంపుడు శునకాలు పాల్గొననున్నాయి. పోటీల్లో గెలుపొందే శునకాలకు బహుమతులు అందజేయనున్నారు.

నేడు 44 సబర్బన్ రైళ్ల పాక్షిక రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 17: మరమ్మతుల కారణంగా ఆదివారం చెన్నై బీచ్ - చెంగల్పట్టు మార్గంలో 44 సబర్బన్ రైలు సేవలు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. కోడంబాక్కం - తాంబరం మధ్య ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఈ పనులు జరగనున్నాయి. ఈ కారణంగా చెన్నై బీచ్ నుంచి తాంబరం - చెంగల్పట్టు మధ్య ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3.15 గంటల వరకు రెండు మార్గాల్లో సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు, మధ్యాహ్నం 3.30 అనంతరం రైళ్లు యథావిధిగా నడుస్తాయని అధికారులు తెలిపారు. అదే సమయంలో తాంబరం - చెంగల్పట్టు మధ్య ప్రయాణికుల సౌకర్యార్థం ఉదయం 11.55, మధ్యాహ్నం 12.45, 1.25, 1.45, 1.55, 2.40, 2.55 గంటలు, చెంగల్పట్టు - తాంబరం మధ్య ఉదయం 9.30, 9.40, 10.55, 11.05, 11.30, మధ్యాహ్నం 12, 1.00 గంటలకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.

పెరగనున్న పగటి ఉష్ణోగ్రతలు

పెరంబూర్, ఫిబ్రవరి 17: తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఆది, సోమవారాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధరణం కన్నా 2 నుంచి 3 డిగ్రీలు పెరగనున్నాయి. ఈ మేరకు చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో ప్రధానంగా పొడి వాతావరణం నెలకొంటుందని, వేకువజామున, ఉదయం వేళల్లో మంచు కురిసే అవకాశముందన్నారు. రాజధాని నగరం చెన్నై ఆకాశం మేఘావృతంగా ఉంటూ పగటి ఉష్ణోగ్రతలు 32-33 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 22-24 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

26న ఉద్యోగ మేళా

ఐసిఎఫ్, ఫిబ్రవరి 17: చెన్నై జిల్లా ఉద్యోగ అవకాశాలు, వృత్తి శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 26వ తేది ప్రైవేటు శాఖల ఉద్యోగ అవకాశాల శిబిరం జరగనుంది. మైలాపూర్ క్వీన్ మేరీస్ కళాశాలలో జరగనున్న ఈ శిబిరంలో పాల్గొని ఉద్యోగాలు పొందే వారికి ముఖ్యమంత్రి స్టాలిన్ నియమాక ఉత్తర్వులు అందజేస్తారు. ఈ శిబిరంలో 250కి పైగా సంస్థలు పాల్గొని, సుమారు 20 వేలకు పైగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి.

టాటానగర్ - ఎర్నాకుళం మధ్య ప్రత్యేక రైలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 17: ప్రయాణికుల రద్దీ నియంత్రించేలా టాటానగర్ - ఎర్నాకుళం మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. జార్ఖండ్ రాష్ట్రం టాటానగర్ నుంచి ఈ నెల 19, 26 తేదీల్లో ఉదయం 5.15 గంటలకు బయల్దేరి ఎర్నాకుళం వెళ్లే వారాంతపు ప్రత్యేక రైలు మరుసటిరోజు వేకువజామున 1.55 గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది. మరో మార్గంలో ఎర్నాకుళం నుంచి ఈ నెల 22, 19 తేదీల్లో ఉదయం 7.15 గంటలకు బయల్దేరి మరుసటి రోజు తెల్లవారుజామున 4.30 గంటలకు టాటానగర్ చేరుకుంటుంది.

త్వరలో పట్టణంబాక్కం ఫిష్ మార్కెట్ ప్రారంభం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 17: స్థానిక పట్టణంబాక్కం లూప్ రోడ్డులో రూ.10 కోట్లతో నిర్మిస్తున్న అత్యాధునిక చేపల మార్కెట్‌ను మార్చిలో ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. తేనాంపేట మండలం 125వ వార్డు పరిధిలోని పట్టణంబాక్కం సముద్రతీరాన్ని ఆనుకొని ఉన్న లూప్ రోడ్డులో ఇరువైపుల చేపల దుకాణాలు నడుపుతుండడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో, వ్యాపారుల సౌకర్యార్థం ప్రత్యేకంగా మార్కెట్‌ను నిర్మిస్తున్నారు. పనులు ముగింపు దశకు చేరుకోవడంతో మార్చిలో ప్రారంభించనున్నామని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

టీఐఎఫ్ వైద్యశిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్యారీస్, ఫిబ్రవరి 17: టాబ్లెట్స్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృష్ణా భాయ్ జావేద్ 15వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం చెన్నైలో నిర్వహించిన మెగా వైద్య ఉచిత శిబిరానికి విశేష స్పందన లభించింది. తండయార్‌పేటలోని కెప్టెన్ మహాల్ వేదికగా ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని టీఐఎఫ్ సీఈఓ ఆర్కే జావేద్ దంపతులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ భరత్ జావేద్, టెక్నికల్ డైరెక్టర్ కేవీ వాసుదేవ్, వర్క్స్ డైరెక్టర్ ఎం.రవి, జనరల్ మేనేజర్ వి.శేఖర్ తదితరులు హాజరయ్యారు. పమ్మల్ శంకర్ నేత్రాలయ, హార్ట్స్ ఫర్ హార్ట్స్ రాగాస్ దంత వైద్యకళాశాలకు చెందిన వైద్యులు, సిబ్బంది సుమారు 1,000 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. నేత్ర, దంత, రక్త, ఎకో స్క్రీనింగ్, ఈసీజీ, ఆర్థోపెడిక్ తదితర పరీక్షలు చేసి, వైద్యులు సిఫారసు చేసిన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

పదేళ్లలో 411 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన బీజేపీ

● డీఎంకే నేత ఆర్ఎస్ భారతి ఆరోపణ



సభలో ప్రసంగిస్తున్న ఆర్ఎస్ భారతి

పెరంబూర్, ఫిబ్రవరి 17: దేశంలోని పలు రాష్ట్రాల్లో పదేళ్లలో 411 మంది ఎమ్మెల్యేలను బీజేపీ కొనుగోలు చేసిందని డీఎంకే ప్రిసీడియం ఛైర్మన్ ఆర్ఎస్ భారతి చెప్పారు. విల్లుపురంలో శుక్రవారం రాత్రి 'హక్కులు సాధించేలా స్టాలిన్ గళం' పేరిట నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... ప్రధాని మోదీ రోజూ ధరించే దుస్తుల విలువ రూ.10 లక్షలకు పైగా ఉంటుందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ తెలిపారని, ఆ ప్రకారం, ఆడంబర జీవితానికి ప్రధాని అలవాటుపడ్డారన్నారు. డీఎంకే, ప్రతిపక్ష పార్టీల నేతలపై ఈడీ విభాగాన్ని ఉసిగొల్పుతున్నారని చెప్పారు. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో విజయకాంత్ డీఎంకే కూటమిలో చేరుతారని భావించామన్నారు. ఆ సమయంలో ఆయన కూటమిలో చేరి ఉంటే డీఎంకే అధికారం చేపట్టేదని, తదుపరి కరుణానిధి, జయలలిత, విజయకాంత్... ఇప్పుడు కూడా ప్రాణాలతో జీవించి ఉండేవారన్నారు. 2021లో డీఎంకే అధికారం చేపట్టిన తర్వాత, రాష్ట్రంలో నిధులు కొరత ఏర్పడేలా చేసింది కేంద్ర ప్రభుత్వమేనని అన్నారు. కేంద్రప్రభుత్వ జిమ్మిక్కులతో సీఎం కుర్చీ అధిరోహించిన వ్యక్తి పళనిస్వామి అన్నారు. రాబోయే ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరిలోని 40 ఎంపీ స్థానాల్లో డీఎంకే కూటమి ఘనవిజయం సాధిస్తుందని ఆర్ఎస్ భారతి ఆశాభావం వ్యక్తం చేశారు.

కారుతో ఏనుగుకు వేధింపులు

జి అన్నాడీఎంకే నేతకు రూ.లక్ష జరిమానా



ఏనుగును వెంటాడుతున్న దృశ్యం (పక్క చిత్రంలో) అన్నాడీఎంకే నేత మిథున్

పెరంబూర్, ఫిబ్రవరి 17: కారు ముందున్న లేజర్ హెడ్‌ల్యాంప్‌తో ఏనుగును వేధించిన అన్నాడీఎంకే నేతకు రూ.లక్ష జరిమానా విధించారు. కోయంబత్తూర్ జిల్లా పొల్లాచ్చి సమీపంలోని రక్షిత ప్రదేశంగా ఆనైమలై పులుల శరణాలయం ఉంది. ఈ శరణాలయంలో పులులు, చిరుతలు, ఏనుగులు, ఎలుగుబంట్లు సహా పలు జంతువులున్నాయి. రాత్రి సమయాల్లో జంతువులు ఆ ప్రాంతంలో రోడ్లు దాటుతుంటాయి. దీంతో, ఈ శరణాలయంలోని రోడ్లపై రాత్రి వేళల్లో వాహనాలు వెళ్లేందుకు నిబంధనలు విధించారు. కానీ, పలువురు వాహనచోదకులు జంతువులు వెళ్లే సమయంలో హారన్లు కొట్టడం, వాటిని బెదిరించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో, పొల్లాచ్చి సమీపం కోటూరు ప్రాంతానికి చెందిన అన్నాడీఎంకే యువజన విభాగం కార్యదర్శి మిథున్, తన సెల్‌ఫోన్‌లో ఓ వీడియోను స్టేటస్‌గా ఉంచారు. అందులో తన కారుకున్న లేజర్ హెడ్ లైట్లు, పెద్ద శబ్దం చేసే హారన్ వేస్తూ రోడ్డుపై వెళుతున్న ఏనుగును వెంటాడడం, ఆ ఏనుగు పరుగులు తీస్తున్న దృశ్యాలు చోటుచేసుకున్నాయి. ఈ దృశ్యాలను అటవీ శాఖ అధికారులు పరిశీలించగా, ఈ దృశ్యాలు రక్షిత ప్రాంతమైన ఆనైమలై శరణాలయం ప్రాంతంలో గురువారం రాత్రి జరిగినట్లు గుర్తించారు. దీనికి కారకుడైన అన్నాడీఎంకే నేత మిథున్‌కు రూ.లక్ష జరిమానా విధిస్తూ నోటీసు జారీ చేశారు.

టీఎన్‌పీఎస్సీ సభ్యులుగా ఐదుగురి నియామకం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 17: టీఎన్‌పీఎస్సీ సభ్యులుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సహా ఐదుగురు నియమితులయ్యారు. తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ)కి అధ్యక్షుడు, 14 మంది సభ్యులను గవర్నర్ ఆమోదంతో రాష్ట్రప్రభుత్వం నియమిస్తుంది. ఇటీవల అధ్యక్షుడు లేకుండా నలుగురు సభ్యులతో పనిచేస్తున్న టీఎన్‌పీఎస్సీని సభ్యుడు మునియనాథన్ అధ్యక్షుడుగా వ్యవహరిస్తూ పర్యవేక్షించారు. అధ్యక్షుడిగా రిటైర్డ్ డీజీపీ శైలేంద్రబాబు, సభ్యులుగా మరికొందరి నియామకానికి గవర్నర్‌కు ప్రభుత్వం సిఫారసు చేసింది. ఈ సిఫారసును గవర్నర్ నిరాకరించడంతో, సభ్యులుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శివకుమార్, ఐఆర్ఎస్ అధికారి శరవణ కుమార్, డాక్టర్ తవమణి, ఉషా సుకుమార్, ప్రేమ్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఇంకా అధ్యక్షుడు, మరో ఐదుగురు సభ్యులను నియమించాల్సి ఉంది.

విజయ్ రాజకీయ పార్టీపై హ్యాష్‌స్టాగ్

● 'ఎక్స్'లో సంచలనం

ప్యారీస్, ఫిబ్రవరి 17: యువ హీరో దళపతి విజయ్ కొత్తగా ప్రారంభించిన 'తమిళగ వెట్రి కళగం' గురించి 'ఎక్స్' పేజీలో హ్యాష్‌స్టాగ్ ట్రెండింగ్ అవుతోంది. పార్టీ పేరుతో కూడిన పదంలో తప్పులున్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో పలువురు వ్యక్తులు విమర్శలు లేవనెత్తుతున్నారు. దీనిపై స్పందించిన విజయ్... పార్టీ పేరును 'తమిళగ వెట్రిక్కళగం'గా మార్పు చేసి ప్రకటించారు. ప్రస్తుతం ఈ పేరు హ్యాష్‌స్టాగ్‌లో ట్రెండింగ్ అవుతోంది.

నేడు చెన్నైకి కమలహాసన్

ప్యారీస్, ఫిబ్రవరి 17: విదేశీ పర్యటన ముగించుకొని మక్కల్ నీది మయ్యం పార్టీ అధ్యక్షుడు, నటుడు కమల హాసన్ ఆదివారం నగరానికి తిరిగి రానున్నారు. ఆయన పార్లమెంటు ఎన్నికల్లో నియోజకవర్గాల కేటాయింపుపై డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌తో వచ్చే వారం చర్చల్లో పాల్గొనే అవకాశముందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈసారన్నా కమల్ ఎన్నికల్లో ప్రత్యక్షంగా పోటీచేస్తారా, లేకుంటే రాజ్యసభ సీటు కోరతారా అన్న దానిపై స్పష్టత ఉంటుందని పార్టీ నిర్వాహకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

రేపు ఐటీ కార్యాలయాల ఎదుట కాంగ్రెస్ ధర్నా

ఐసిఎఫ్, ఫిబ్రవరి 17: ఆలిండియా కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతాలు స్తంభింపజేయడాన్ని ఖండిస్తూ ఈనెల 19న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐటీ కార్యాలయాల ముందు కాంగ్రెస్ పార్టీ తరపున ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు కేఎస్ అళగిరి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. చెన్నై సహా అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షులు తమ సారథ్యంలో నిర్వహించే ధర్నాలో అన్ని అనుబంధ శాఖల నాయకులు తప్పనిసరిగా పాల్గొని, కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించాలని అళగిరి తన ప్రకటనలో సూచించారు.

సబర్బన్ రైళ్ల రద్దుతో అదనపు ఎంటీసీ బస్సులు

పెరంబూర్, ఫిబ్రవరి 17: స్థానిక కోడంబాక్కం - తాంబరం మధ్య చేపట్టనున్న పనుల కారణంగా ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3.15 గంటల వరకు సబర్బన్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించిందని, ప్రయాణికుల సౌకర్యార్థం ఆ సమయంలో తాంబరం-చెన్నై బీచ్ మధ్య 150 అదనపు బస్సు సర్వీసులు నడపనున్నారు. అలాగే, శనివారం రాత్రి 11.45 నుంచి నాలుగు రోజులు (ఈ నెల 22వ తేది) తెల్లవారుజామున 4.30 గంటల వరకు చెన్నై బీచ్-తాంబరం మధ్య సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ప్రకటన నేపథ్యంలో, ఆ సమయంలో చెన్నై బీచ్-తాంబరం మధ్య 20 అదనపు బస్సులు నడుపుతున్నట్లు చెన్నై మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) మేనేజింగ్ డైరెక్టర్ ఆల్బీజాన్ వర్గీస్ ప్రకటన విడుదల చేశారు.

తాంబరం - చెంగల్పట్టు మధ్య మూడో రైలుమార్గం

● ఏడు రైళ్ల రద్దు

ప్యారీస్, ఫిబ్రవరి 17: స్థానిక తాంబరం - చెంగల్పట్టు మధ్య మూడో రైలుమార్గం నిర్మాణ పనులు చేపట్టిన కారణంగా ఈ మార్గంలో నడుపుతున్న 90 సబర్బన్ రైళ్ల సేవలను 83గా తగ్గించడంపై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర శివారులో ఉన్న ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతుండడంతో ఐటీ సంస్థలు, కర్మాగారాలు, ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలు, పాఠశాలలు, షాపింగ్ మాల్స్, హోటళ్లు, లాడ్జీల సంఖ్య కూడా పెరిగాయి. శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రజల సౌకర్యార్థం దక్షిణ రైల్వే శాఖ తాంబరం నుంచి చెంగల్పట్టు వరకు రైళ్ల సంఖ్య పెంచేలా మూడవ మార్గాన్ని నిర్మించే పనులు చేపట్టింది. ఈ పనులకు అంతరాయం కలగకుండా ప్రస్తుతం చెన్నై బీచ్ నుంచి తాంబరం-చెంగల్పట్టు మధ్య ఏడు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసింది. దీని వల్ల ఉద్యోగాలకు వెళ్లే వారు, వ్యాపారులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

19న చిన్నయ'సూరి' 216వ జయంతి వేడుకలు

అడయార్, ఫిబ్రవరి 17: రాజధాని కళాశాల, చెన్నపురి తెలుగు అకాడమీ సంయుక్తంగా ఈనెల 19వ తేదీ సోమవారం (రేపు) చిన్నయ'సూరి' 216వ జయంతి వేడుకలను నిర్వహించనున్నాయి. ఈ వేడుకల్లోనే తెలుగు సాహిత్య సేవలో 'సాహిత్య అకాడమీ' గ్రంథ సమీక్ష సభను కూడా నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం 3 గంటలకు స్థానిక చెపాకం, మెరీనా బీచ్ రోడ్డులో ఉన్న రాజధాని కాలేజీ ప్రాంగణంలోని పావెల్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి రాజధాని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామన్ అధ్యక్షత వహిస్తారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, విశిష్ట అతిథిగా ఆదాయపన్ను శాఖ చెన్నై విభాగం అదనపు కమిషనరు ఎం.సమత, ఆత్మీయ అతిథిగా ఏపీలో కేంద్ర ప్రభుత్వం క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి పాల్గొంటున్నారు. ఏపీలోని చీరాలకు చెందిన విశ్రాంత ఉపన్యాసకుడు డాక్టర్ బీరం సుందర రావు గ్రంథ సమీక్ష చేస్తారు. ఈ కార్యక్రమాన్ని చెన్నపురిలోని తెలుగు భాషా ప్రియులతో పాటు తెలుగు ప్రజలంతా ఆహ్వానితులేనని చెన్నైపురి తెలుగు అకాడమీ, రాజధాని కళాశాల తెలుగుశాఖ సంయుక్తంగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో వెల్లడించాయి.

ఢిల్లీలో రైతుల పోరాటానికి మద్దతుగా రైల్‌రోకో



రైలుపట్టాలపై బైఠాయించిన రైతులు

పెరంబూర్, ఫిబ్రవరి 17: తంజావూరు రైల్వేస్టేషన్‌లో రైతు సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం రైల్‌రోకో చేపట్టారు. ఢిల్లీలో ఆందోళన చేపట్టిన రైతులకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రైతులు శనివారం ఆందోళనలు చేపట్టారు. ప్రధాని ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఎంఎస్ స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని, రాష్ట్రప్రభుత్వ ఉచిత విద్యుత్ రద్దు చేసేలా కేంద్రం చేపట్టిన విద్యుత్ సవరణ చట్టం ఉపసంహరించుకోవాలని, రైతుల రుణాల రద్దు తదితర డిమాండ్లతో ఢిల్లీలో లక్షలాది మంది రైతులు ట్రాక్టర్లతో చేరుకొని ఆందోళనలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వారికి మద్దతుగా తంజావూరు రైల్వేస్టేషన్‌లో జరిగిన రైల్‌రోకోకు రైతు సంఘాల సమాఖ్య నాయకులు పీఆర్ పాండ్యన్, పి.అయ్యాకన్నులు నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా సుమారు 60 మంది రైతులను పోలీసులు అరెస్ట్ చేశారు.

అభ్యర్థి ఖరారు కోసం...

హస్తినలో బీజేపీ నేతల మకాం

అడయార్, ఫిబ్రవరి 17: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి స్థానం నుంచి పోటీ చేసే అభ్యర్థి కోసం ఆ రాష్ట్రానికి చెందిన భారతీయ జనతా పార్టీ నేతలు ఢిల్లీలో మకాం వేశారు. పార్లమెంట్ ఎన్నికల కోసం పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక చేసే నిమిత్తం అన్ని రాష్ట్రాలకు చెందిన పార్టీ నిర్వాహకులతో బీజేపీ పెద్దలు శనివారం నుంచి రెండు రోజుల పాటు ఢిల్లీలో సమావేశం నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనేందుకు పుదుచ్చేరికి చెందిన బీజేపీ సీనియర్ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు హస్తినకు చేరుకున్నారు. వీరిలో మంత్రులు నమశ్శివాయం, సాయి శరవణ కుమార్, ఎమ్మెల్యేలు కళ్యాణ సుందరం, జాన్ కుమార్, అశోక్ బాబు, వివియన్ రిచర్డ్, వీపీ రామలింగం, వెంకటేశన్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వగణపతి తదితరులు ఉన్నారు. వీరంతా కలిసి పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాతో సమావేశమై పుదుచ్చేరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసే అభ్యర్థిని ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది.

ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 17: ల్యాబ్ టెక్నీషియన్ డిప్లొమా కోర్సుకు కార్పొరేషన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. స్థానిక తండయార్‌పేట అంటువ్యాధుల ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ డిప్లొమా కోర్సులో చేరేందుకు 12వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఈనెల 19 నుంచి 25వ తేది వరకు నేరుగా ఆసుపత్రి కార్యాలయాన్ని సంప్రదించి చేసుకోవచ్చని కార్పొరేషన్ తెలిపింది.

నేటినుంచి అడయార్‌లో ట్రాఫిక్ మార్పులు

పెరంబూర్, ఫిబ్రవరి 17: మెట్రోరైలు పనుల కారణంగా అడయార్ ఇందిరానగర్‌లో ఆదివారం నుంచి వారం రోజులు ట్రాఫిక్ మార్పులు అమలులో ఉంటాయని నగర ట్రాఫిక్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఓఎంఆర్ వైపు వెళ్లే వాహనాలు...

- ఎంజీ రోడ్డు నుంచి ఇందిరా నగర్ 2వ అవెన్యూ మీదుగా ఓఎంఆర్ వెళ్లేందుకు వాహనాలు అనుమతించరు. అందుకు బదులుగా 2వ అవెన్యూ, 3వ మెయిన్ రోడ్డు, 21వ క్రాస్ వీధి, ఇందిరా నగర్ 3వ అవెన్యూ మీదుగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలి.
- కళాక్షేత్ర నుంచి ఓఎంఆర్ వైపు వాహనాలకు అనుమతి
- కేబీఎన్ నుంచి ఓఎంఆర్ వైపు వాహనాలకు అనుమతి

ఎల్బీ రోడ్డు వైపుకు...

- ఓఎంఆర్ నుంచి 2వ అవెన్యూ మార్గంగా ఎల్బీ రోడ్డు వైపుకు వాహనాలు అనుమతించరు. బదులుగా వాహనాలు 2వ అవెన్యూ, 3వ మె యిన్ రోడ్డు, ఇందిరానగర్ 1వ మెయిన్‌రోడ్డు మీదుగా గమ్యస్థానాలకు చేరుకోవాలి.
- కళాక్షేత్ర నుంచి ఇందిరా నగర్ 3వ అవెన్యూ మార్గంగా ఎల్బీ రోడ్డు వైపు వెళ్లే వాహనాలు ఇందిరా నగర్ 4వ అవెన్యూ, 3వ మెయిన్ రోడ్డు, ఇందిరా నగర్ 2వ అవెన్యూ మీదుగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలి.

కేబీఎన్ వైపుకు...

- ఓఎంఆర్, కళాక్షేత్ర నుంచి కేబీఎన్ జంక్షన్ వెళ్లే వాహనాలు యథావిధిగా అనుమతి.



వేలూరు జిల్లా గుడియాత్తం గ్రామీణ పోలీసు ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శాంతికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్పీఐ జిల్లా అధ్యక్షుడు దళిత్‌కుమార్, యువజన విభాగం సెక్రటరీ మణికంఠన్, కేవీ కుప్పం యూనియన్ సెక్రటరీ రాజ్‌కుమార్

మళ్లీ అరెస్టు అయిన ఖైదీలు

అడయార్, ఫిబ్రవరి 17: కోర్టులో హాజరయ్యేందుకు వచ్చినపుడు గంజాయి ప్యాకెట్లను కలిగివున్నందుకు గాను ఇద్దరు ఖైదీలను పోలీసులు మళ్లీ అరెస్టు చేశారు. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే... రాయపురం వైకుంఠం వీధికి చెందిన దండపాణి, మణలి, జహీర్‌హుస్సేన్ వీధికి చెందిన మురుగన్ డ్రగ్స్ కేసులో అరెస్టయ్యారు. ఇటీవల వీరిద్దరూ బెయిల్‌పై విడుదల కాగా, నిబంధనల్లో భాగంగా శుక్రవారం వీరిద్దరు మద్రాస్ హైకోర్టులోని ఎన్‌డీపీసీ కోర్టులో హాజరయ్యేందుకు వచ్చారు. ఆ సమయంలో వారిని భద్రతా సిబ్బంది తనిఖీ చేయగా 10 గ్రాముల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి, మళ్లీ అరెస్టు చేసి పుళల్ జైలుకు తరలించారు.

ఆటోలో గంజాయి విక్రయాలు

ఆటోలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కొడుంగయూరు - మూలక్కడైలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ శరవణన్ నేతృత్వంలో సిబ్బంది శుక్రవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో మూలకడై వంతెన వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఆటోను ఆపి, అందులోని ఇద్దరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. ఆటోలో కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత నామక్కల్ జిల్లాకు చెందిన మాధవన్, చెన్నై రెడ్‌హిల్స్‌కి చెందిన దినేష్‌ని అరెస్టు చేశారు. వీరివద్ద జరిపిన విచారణలో వ్యాసర్పాడి బీవీకాలనీకి చెందిన కలై సెల్వన్, సయ్యద్ ముష్రాఫ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసినట్టు చెప్పారు. దీంతో వారిద్దరిని కూడా అరెస్టు చేసి, మరో రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ నలుగురిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. కేసు విచారణ జరుపుతున్నారు.

వీఐటీ వర్శిటీలో సిలంబం పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్

వేలూరు, ఫిబ్రవరి 17: కాట్పాడిలో ఉన్న వీఐటీ యూనివర్శిటీలో మహిళల సిలంబం పోటీలు శనివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి వర్శిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం అధ్యక్షత వహించగా, వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ.. దేశంలో 4 కోట్లమంది హయ్యర్ సెకండరీ, 26 కోట్ల మంది పాఠశాల విద్యార్థులున్నారన్నారు. చిన్న దేశాలకు చెందిన వారు అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పతకాలు సాధిస్తున్నారన్నారు. కానీ, పతకాల సాధనలో భారత్ వెనుకంజలో ఉందన్నారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించి, వారు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. విద్యారంగంలో తమిళనాడు అగ్రస్థానంలో ఉందని, అలాగే క్రీడల్లో కూడా నిలిచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'ఎండ్ వార్స్ సీక్వెల్' ఆవిష్కరణ



ఆవిష్కరణలో లోకేష్ కనకరాజ్ తదితరులు

అడయార్, ఫిబ్రవరి 17: ఎండ్‌వార్స్ సీక్వెల్, ట్రెండ్ సెట్టింగ్ తమిళ ట్రాన్స్ క్రియేషన్‌ను చెన్నై మొట్టమొదటి కామిక్ కాన్‌లో రూపొందించగా ప్రముఖ దర్శకుడు లోకేష్ కనకరాజ్ ఆవిష్కరించారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ గేయ రచయిత మదన్ కార్కీ రచించిన 'లింగ్విస్టిక్ మార్వెల్ ఎండ్ వార్స్ సాగాకు నవలా నైపుణ్యాన్ని జోడించి రూపొందించారు. తమిళ ప్రోమో సాంగ్‌ను అన్ని తమిళ ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లలో అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా దర్శకుడు లోకేష్ కనకరాజ్ ఎండ్‌వార్స్ వెనుక ఉన్న ప్రతి ఒక్క ప్రతిభావంతుడిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గేయ రచయిత మదన్ కార్కీ, శ్రీవైకుంఠం ఎమ్మెల్యే, దర్శకుడు, రచయిత అమృతరాజ్ సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల కిడ్నాప్ వదంతులే

● నగర పోలీసు శాఖ

పెరంబూర్, ఫిబ్రవరి 17: పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు వదంతులని, వాటిని నమ్మొద్దని నగర పోలీసు కమిషనర్ కార్యాలయం ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ కార్యాలయం శనివారం విడుదల చేసిన ప్రకటనలో... పిల్లలను కిడ్నాప్ చేసేందుకు యత్నిస్తున్నారనే సోషల్ మీడియాలో వార్తలు పోస్ట్ చేస్తున్న వారిపై కఠినచర్యలు చేపడతామని హెచ్చరించింది. ప్రజలకు ఏవైనా సందేహాలు, ఫిర్యాదులుంటే 24 గంటలు పనిచేసే '100', '112' నెంబర్లను సంప్రదించాలని నగర పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

పళవేర్కాడు వద్ద మృత్యువాతపడుతున్న అరుదైన బాతులు



బాతు కళేబరాలు

పెరంబూర్, ఫిబ్రవరి 17: స్థానిక పళవేర్కాడు శరణాలయ ప్రాంతంలో బాతులు మృతి చెందడంపై అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. తిరువళ్లూర్ జిల్లా పళవేర్కాడు శరణాలయంలో గూడ బాతు, నల్లకాళ్ల బాతు, గద్ద ముక్కు బాతు సహా 126 రకాల పక్షి జాతులున్నాయి. ఈ నేపథ్యంలో, కొద్దిరోజులుగా ఈ ప్రాంతంలో బాతులు మృతి చెందడాన్ని గమనించిన పక్షి ప్రేమికులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు, పశువైద్యులతో అక్కడ మకాం వేసి మృతిచెందిన బాతులకు పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. నదిలో రసాయన వ్యర్థాలు కలువడం వల్ల బాతులు చనిపోతున్నాయా? వాతావరణ పరిస్థితుల మార్పుతో మృతి చెందుతున్నాయా? అనే కోణాల్లో విచారిస్తున్నారు. కాగా పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాత బాతుల అకాల మృతికి కారణాలు వెల్లడవుతాయని అధికారులు తెలిపారు.

బేసిన్ బ్రిడ్జి వద్ద పట్టాలు తప్పిన రైలింజన్

పెరంబూర్, ఫిబ్రవరి 17: స్థానిక చెన్నై సెంట్రల్ నుంచి బేసిన్ బ్రిడ్జి వైపుకు వెళుతున్న నీలగిరి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ఎక్స్‌ప్రెస్ రైలింజన్ వెనుక భాగంలో ఉన్న మూడు జతల చక్రాలు పట్టా నుంచి కిందకు జారాయి. ఈ కారణంగా ఆ మార్గంలో వచ్చే రైళ్లను వేరే మార్గంలో పంపించిన అధికారులు, చక్రాలను తిరిగి పట్టాలపై చేర్చే పనులు చేపట్టారు.

పుళల్ జైలులో సిమ్‌కార్డు స్వాధీనం

అడయార్, ఫిబ్రవరి 17: స్థానిక పుళల్ కేంద్ర కారాగారంలో వివిధ నేరాల్లో శిక్ష పడిన ఖైదీల వార్డులో సిమ్‌కార్డును జైలు సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈ జైలులోని పురుషుల వార్డులో జైలు ఉన్నతాధికారులు శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మరుగుదొడ్డిలో భూమిలో పాతిపెట్టిన సిమ్ కార్డును గుర్తించి స్వాధీనం చేసుకున్న జైలు సిబ్బంది జైలు ఉన్నతాధికారులకు సమర్పించారు. ఈ సిమ్ కార్డు పురుషుల వార్డులోకి ఎలా వచ్చిందన్న అంశంపై విచారణ జరుపుతున్నారు.

మెకెదాటుకు వ్యతిరేకంగా రైతులతో ఆందోళన

● ఈపీఎస్ ప్రకటన

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కావేరి నదిపై మెకెదాటు వద్ద ఆనకట్ట నిర్మించేందుకు కర్ణాటక ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఖండిస్తూ త్వరలో రైతులతో కలిసి రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపట్టనున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ప్రకటించారు. మెకెదాటు ఆనకట్ట నిర్మాణానికి ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ విషయమై తాను పలుమార్లు శాసనసభలో ప్రస్తావించినా పాలకులు పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ తమ కూటమి మిత్రపక్షమైన కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి మెకెదాటు ఆనకట్ట నిర్మాణ పనులను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

మెకెదాటు నిర్మించే అవకాశమే లేదు

● మంత్రి దురైమురుగన్

పెరంబూర్, ఫిబ్రవరి 17: ఎలాంటి పరిస్థితుల్లోను మెకెదాటు డ్యాంను కర్ణాటక ప్రభుత్వం నిర్మించే అవకాశమే లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ స్పష్టం చేశారు. రాణిపేట జిల్లాలో శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... కర్ణాటక మెకెదాటు డ్యాం నిర్మాణానికి నిధులు కేటాయించినా, ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినా ఎలాంటి ఫలితం లేదన్నారు. తమిళనాడు ప్రభుత్వ అనుమతి లేనిదే డ్యాం నిర్మించలేరని తెలిపారు.

రైలునుంచి జారిపడి నవ వధువు మృతి

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా ఆరల్‌వాయ్ మొళి రైల్వే స్టేషన్ వద్ద కదులుతున్న రైలు నుంచి జారి పడి నవ వధువు ప్రాణాలు కోల్పోయింది. ఆరల్‌వాయ్‌మొళి అళగియనగర్ వీరసింగమ్ ప్రాంతానికి చెందిన షీలా (21)కు, కాంచీపురం జిల్లా వల్లమ్ ప్రాంతానికి చెందిన అన్బరసు అనే యువకుడితో ఏడు మాసాలకు ముందు వివాహం జరిగింది. రెండు రోజులకు ముందు షీలా స్వస్థలానికి కన్నియాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరింది. ఆ రైలు ఆరల్‌వాయ్‌మొళి రైల్వేస్టేషన్ ముందు రెడ్ సిగ్నల్ పడటంతో కాసేపు ఆగింది. ఆ సమయంలో షీలా బోగీ నుండి కిందకు దిగుతుండగా రైలు ఉన్నట్టుండి కదిలింది. దీనితో ఆమె జారి కిందపడి తీవ్రంగా గాయపడింది. ఈ సమాచారం తెలుసుకుని రైల్వే పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స ఫలించక ఆమె శనివారం ఉదయం మృతి చెందింది.

హీరో జై ఆకాశ్ మంచి మనసున్న వ్యక్తి

● మాజీ న్యాయమూర్తి



'జై ఆకాశ్, మొహమ్మద్ జియావుద్దీన్

చిత్రజ్యోతి

హీరో జైఆకాశ్ ఓ మంచి మనిషి అని మాజీ న్యాయమూర్తి మొహమ్మద్ జియావుద్దీన్ అన్నారు. ఏ క్యూబ్ మూవీస్ యాప్ బ్యానరుపై జై ఆకాశ్ హీరోగా నటించిన చిత్రం 'జైవిజయం'. ఈ చిత్రాన్ని జైఆకాశ్ సొంతంగా నిర్మించడమేకాకుండా, తన సొంత పేరైన జై సతీశన్ నాగేశ్వరన్ అనే తన సొంత పేరుతో దర్శకత్వం వహించారు. హీరోయిన్‌గా అక్షయ కొండముత్తు నటించారు. అక్షయ రాయ్, ఏసీబీ రాజేంద్రన్ వంటి పలువురు నటించారు. ఇటీవల విడుదలై విజయం సాధించింది. దీంతో సినిమా విజయోత్సవాలను తాజాగా నగరంలో నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ న్యాయమూర్తి మొహమ్మద్ జియావుద్దీన్ మాట్లాడుతూ... 'జై ఆకాశ్‌తో కలిసి ఒక రోజంతా ఓ కార్యక్రమంలో పాల్గొన్నా. ఆయన ఎంతో మనిషి అని ఆ రోజున తెలిసింది. అప్పటినుంచి జైఆకాశ్ మంచి స్నేహితుడైపోయారు. ఆయన అనేక మందికి సాయం చేస్తుంటారు. అలా నా మనసులో స్థానం సంపాదించుకున్నాడు. ఆ స్నేహబంధంతోనే ఈ వేడుకలో పాల్గొన్నా. ఇప్పటివరకు నేను ఒక్క సినిమా ఫంక్షన్‌లో కూడా పాల్గొనలేదు. ఈ సినిమాలో అద్భుతంగా నటించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు' అని అన్నారు. హీరో జై ఆకాశ్ మాట్లాడుతూ... 'ఇకపై మెగా ఫోన్ పట్టుకుని దర్శకత్వం చేయను. కేవలం నటనపై మాత్రమే దృష్టిసారిస్తా. ఏ క్యూబ్ మూవీస్ యాప్‌లో ఈ సినిమాను విడుదల చేశాం. మేం అనుకున్న దానికంటే అధికంగానే ప్రేక్షకుల నుంచి స్పందన వచ్చింది. గతంలో నేను నటించిన అనేక చిత్రాలు తెలుగులో సూపర్ హిట్స్ సాధించాయి. ఇపుడిపుడే తమిళంలో కూడా నా చిత్రాలకు ఆదరణ లభిస్తోంది. ప్రతి శుక్రవారం నా చిత్రం విడుదలకావాలని కోరుకుంటున్నారు. ఇలాంటి కోరిక నాకు కూడా ఉంది. మున్ముందు మరిన్ని చిత్రాల్లో నటిస్తా. ప్రేక్షకులు, అభిమానులకు కృతజ్ఞతలు. జైవిజయం సక్సెస్‌కు నా అభిమానులు మీడియానే కారణం' అని అన్నారు.

'తంగముట్టై'గా సంపూర్ణేష్ బాబు చిత్రం



'తంగముట్టై'లో ఓ దృశ్యం

తెలుగు నటుడు సంపూర్ణేష్ బాబు తాజా చిత్రం 'బంగారు గుడ్డు'. ఈ సినిమాను తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కించారు. తమిళంలో 'తంగముట్టై'గా టైటిల్ ఖరారు చేశారు. గోపినాథ్ నారాయణమూర్తి దర్శకుడు. నిర్మాతలు కోటేశ్వర రాజు, ఇళంచెళియన్. ఈ సినిమా వివరాలను దర్శకుడు గోపినాథ్ నారాయణమూర్తి వివరిస్తూ... 'తెలుగులో సంపూర్ణేష్ బాబు మంచి నటుడిగా గుర్తింపు పొందారు. ఆయన తాజాగా నటించిన 'మార్టిన్ లూథర్ కింగ్'తో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఇపుడు 'బంగారు గుడ్డు'లో హీరోగా నటిస్తున్నారు. దీన్ని తమిళంలో విడుదల చేస్తున్నాం. ఓ మంచి ప్రేమ, హ్యూమర్ కామెడీ కథను సిద్ధం చేసుకుని నిర్మాత కోసం ఎదురు చూశా. ఒక రోజున నా స్కూల్‌మేట్ ఇళంచెళియన్‌కు కథ వినిపించాను. ఆయనకు కథ నచ్చడంతో సినిమాకు సెట్స్‌పైకి తీసుకెళ్లాం. సంపూర్ణేష్ బాబుతో పాటు రోబో శంకర్ తదితరులు నటించారు. షమీర్ టాండన్ సంగీతం అందించారు. ఇప్పటివరకు సంపూర్ణేష్ నటించిన చిత్రాలకు ఇది పూర్తిభిన్నం. ఇందులో హాస్యం కొత్త తరహాలో ఉంటుంది. షూటింగ్ ఎక్కువభాగం కనకమ్మసత్రం సమీపంలో చిత్రీకరించాం. హీరో సంపూర్ణేష్ దొంగపాత్రను పోషించారు. ఓ రోజున బంగారు గుడ్డులాంటి హీరోయిన్ హీరో కంటికి కనిపిస్తారు. ఆ తర్వాత ఏం జరిగిందన్నదే ఈ చిత్ర కథ. త్వరలోనే ట్రైలర్, ఆడియోతో పాటు రిలీజ్ తేదీలను వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు.

తనయుడి స్వరకల్పనలో తండ్రి నేపథ్యగానం

● 'మామా కుట్టిమా' సాంగ్ రిలీజ్



'మామా కుట్టిమా' సాంగ్ రిలీజ్ దృశ్యం

జాతీయ అవార్డు గ్రహీత అయిన తనయుడు శ్రీకాంత్ దేవా స్వరకల్పనలో ఆయన తండ్రి 'తేనిసై తెండ్రల్' దేవా నేపథ్యగానం చేసిన 'మామా కుట్టిమా' సాంగ్‌ను తాజాగా విడుదల చేశారు. శ్రీలంక రచయిత పొట్టువిల్ అజ్మీన్ గేయ రచన చేశారు. సోలో పాటలతో పాటు తమిళ చిత్రాల్లోని పాటల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకున్న అజ్మీన్.. తాజాగా తన కలం నుంచి జాలువారిన 'మామా కుట్టిమా'కు అద్భుతమైన సంగీత బాణీలను శ్రీకాంత్ దేవా అందించగా, సీనియర్ సంగీత దర్శకుడు దేవా నేపథ్యగానం చేశారు. ఈ పాట ప్రోమోను శ్రీకాంత్ దేవా సమకూర్చారు. ప్రముఖ సామాజిక కార్యకర్త, లండన్‌కు చెందిన వ్యాపారవేత్త డాక్టర్ మాలాకుమార్ తన మాలాకుమార్ పతాకంపై ఈ సాంగ్‌ను రూపొందించారు. 'ముత్తు ముత్తు కరువాయి' వంటి సూపర్ హిట్ సాంగ్‌ను అందించిన శ్రీకాంత్ దేవా - అజ్మీన్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకున్న ఈ పాటకు సంగీత ప్రియుల్లో భారీ అంచనాలే నెలకొన్నాయి. రామ్ ప్రసాద్ దర్శకత్వంలో ఈ సాంగ్‌ను చిత్రీకరించారు. ఈ సాంగ్ రిలీజ్ సందర్భంగా అజ్మీన్ మాట్లాడుతూ... 'ప్రేమికుల దినోత్సవం రోజున ఈ పాటను విడుదల చేయడం సంతోషంగా ఉంది. చిన్నప్పటి నుంచి సంగీత దర్శకుడు దేవా వీరాభిమానిని. ఒకప్పుడు ఆయన పాటలను వింటూ ఎంజాయ్ చేసేవాడిని. ఇపుడు నేను చేసిన గేయరచనను శ్రీకాంత్ దేవా సంగీత దర్శకత్వంలో నేపథ్యగానం చేయడం అదృష్టంగా భావిస్తున్నా. సుదీర్ఘకాలం తర్వాత సంగీత ప్రియులకు దేవా పసందైన విందును అందించారు' అని పేర్కొన్నారు.

ప్లీజ్... బాకీ ఇప్పించండి

● నడిగర్ సంఘానికి మనీషా ఫిర్యాదు



మనీషా యాదవ్

'నినైవెల్లాం నీయడా' చిత్రంలో నటించినందుకు ఆ చిత్ర నిర్మాత చెల్లించాల్సిన రెమ్యునరేషన్ బాకీని తనకు చెల్లించే చర్యలు తీసుకోవాలని నడిగర్ సంఘానికి బెంగుళూరుకు చెందిన హీరోయిన్ మనీషా యాదవ్ ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఆమె చేసిన ఫిర్యాదులో.. "నేను 'నినైవెల్లాం నీయడా' చిత్రంలో నటించా. ఇందులో నటించేందుకు కుదుర్చుకున్న పారితోషికంలో రూ.3 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది.ఈలోగా రెమ్యునరేషన్ బాకీని చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా' అని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు లేఖను తమిళ సినీ నిర్మాతల సంఘానికి నడిగర్ సంఘం పంపించింది. కాగా, 'వళక్కు ఎన్' అనే పేరుతో వచ్చిన సినిమా ద్వారా తమిళ వెండితెరకు పరిచయమైన మనీషా యాదవ్...మూడు నాలుగు చిత్రాల్లో నటించారు. ఆ తర్వాత సరైన అవకాశాలు లేకపోవడంతో ఆమె తిరిగి తన మకాంను బెంగుళూరుకు మార్చేశారు.

ప్రాణం లేని బొమ్మలకు జీవం పోసే కళ తోలుబొమ్మలాట. పురాణాలు, కావ్యాల్లోని ఘట్టాలు, సాంఘిక కథలు ఈ కళారూపానికి ప్రధాన ఇతివృత్తాలు. మానవుడు నాటక దశలో ప్రవేశించే పరిణామక్రమంలో తోలుబొమ్మలాట ప్రధాన పాత్రను పోషించింది. ఈ తోలుబొమ్మలాటల నుండే హరికథలు, నాటకాలు, సినిమాలు అన్నీ పుట్టుకొచ్చాయి. మారుమూల గ్రామీణ ప్రజలకు రామాయణం, మహాభారతం, భాగవతం తదితర ఇతిహాసాల గొప్పదనాన్ని సాధారణమైన భాషలో, ఆయా ప్రాంతాలకు చెందిన యాసలో అందించింది తోలుబొమ్మలాటల కళాకారులేనంటే అతిశయోక్తి కాదు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

గాత్రదానం... : తోలు బొమ్మలకు గాత్రదానం అందిస్తుంటారు. ఈ కళాకారులందరూ మిమిక్రీలో ఆరితేరి ఉంటారు. రాముడి పాత్రకు హుందాతో కూడిన గొంతు, రాక్షసుడి పాత్రకు కర్కశమైన గొంతు, జోకర్ పాత్రకు నవ్వు తెప్పించే గొంతు అంటూ వివిధ రకాలుగా తెరవెనుక డబ్బింగ్ చెప్పి ప్రేక్షకులను అలరింపజేస్తారు. ఇక తోలుబొమ్మలాటలో పద్యాలు పాటలకు కూడా కొదవ ఉండదు. హార్మోనియం, మృదంగం చిన్న నాదస్వరం వాయించే కళాకారులు కూడా తెరవెనుక ప్రధాన పాత్రను పోషిస్తారు. వీరందించే సంగీత ధ్వనులు ఆటను రక్తికట్టిస్తాయి.

SUNDAY SPECIAL



తోల్‌పావైకూత్తులో బొమ్మలు

ఆరు తరాలుగా

తోలుబొమ్మలాటకు పట్టం

● ప్రాచీన కళకు ప్రాణం పోస్తున్న ముత్తుచంద్రన్

తెల్లటి తెర... నీడ

తోలుబొమ్మలాటలో కథ, బొమ్మలు, తెల్లటితెర, నీడ ప్రధాన పాత్రను పోషిస్తాయి. పొడవాటి గుంజలపై తెల్లటి వస్త్రాన్ని కడతారు. ఆ తెర కొంచెం ఏటవాలుగా ఉండేలా చేస్తారు. తోలుబొమ్మలు కనిపించేలా తెరవెనుక పూర్వం కాగడాలు వెలిగించేవారు. ఆ తర్వాత పెట్రోమాక్స్ దీపాలు, ప్రస్తుతం ఫోకస్ లైట్లు ఉపయోగిస్తున్నారు. మేక తోలుతో అందమైన రూపాలు తయారు చేస్తారు. ముఖ్యంగా శ్రీరాముడు, ఆంజనేయుడు, మహావిష్ణువు, రావణాసురుడు వంటి ప్రధాన రూపాలను తయారు చేస్తారు. అందంగా పెయింట్ చేసిన ఆడ బొమ్మలను ఈ ప్రధాన దేవతల భార్యల పాత్రను పోషించడానికి ఉపయోగిస్తారు. ఇక చిన్నపిల్లలకు నవ్వులు తెప్పించే జోకర్ లేదా గిజిగాడి తోలుబొమ్మను తయారు చేస్తారు. ఈ బొమ్మకు ముక్కు పొడవుగా ఉండేలా లేదా, తలపై నిటారుగా నిలిచిన పిలక ఉండేలా చేస్తారు. ఈ బొమ్మల చేతులు సన్నటి తాళ్లతో కట్టి ఉంటాయి. ఆ తాళ్లను తెరవెనుక కళాకారులు పట్టుకుని పాత్రలను నడిపిస్తుంటారు.





వనవాస రాముడికి రంగులు అద్దుతున్న మహిళ - తోలుబొమ్మలకు రంగులు అద్దుతున్న ముత్తుచంద్రన్

ఆరో తరం... ముత్తుచంద్రన్

ఇంతటి విశేషాలను సంతరించుకున్న ఈ తోలుబొమ్మలాటలను భావితరాలకు అందించడానికి కన్నియాకుమారి జిల్లాకు చెందిన కలైమామణి ముత్తుచంద్రన్ అనే కళాకారుడు నడుంబిగించారు. తోలుబొమ్మలాటను తమిళంలో 'తోల్‌పావైకూత్తు' అని అంటారు. ఏడు దశాబ్దాలకు పైగా ముత్తుచంద్రన్ పూర్వీకులంతా ఈ తోలుబొమ్మలాటనే ప్రధాన వృత్తిగా పెట్టుకుని కళామతల్లికి సేవలందించారు. ప్రస్తుతం ముత్తుచంద్రన్ ఆరో తరానికి చెందినవారు. శతాబ్దాల నాటి ఈ జానపద కళారూపాన్ని ఆయన కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారంటే అతిశయోక్తి కాదు. సాంకేతిక పరిజ్ఞానం బాగా అభివృద్ధి చెందిన ప్రస్తుత పరిస్థితుల్లో ఆ పరిజ్ఞానాన్ని కూడా కాస్త జోడించి తోలుబొమ్మలాటను ప్రదర్శిస్తూ ఇప్పటికీ ఆదరించేవారు మెండుగా ఉన్నారని ఆయన చెబుతున్నారు. సినిమాలు, ఓటీటీలు బాగా పుంజుకున్నా, అరచేతిలో అన్నింటినీ తిలకించేందుకు అవకాశం ఉన్నా ఇప్పటికీ ఈ ప్రాచీన కళను ఆదరించేవారున్నారని, అయితే కళాకారులు ఈ ఆటనే ప్రధాన వృత్తిగా చేసుకోవడానికి ప్రస్తుత పరిస్థితులు అనుకరించవని, సేవా భావంతో భావితరాలకు ఈ ప్రాచీన కళారూపాన్ని తెలియజేయడమే ప్రధాన విధిగా భావించాలన్నారు. ఈ తోలుబొమ్మలాటల వల్ల సక్రమమైన సంపాదన లభించదని, అదే సమయంలో ఏదైనా ఉద్యోగం, వ్యాపారం అంటూ ఇతర వ్యాపకాల ద్వారా సంపాదిస్తూ ఈ కళను భావితరాలకు అందించటమే తమ ఆశయమన్నారు.



రావణాసుర వధ ఘట్టంపై రిహార్సల్ చేస్తున్న ముత్తుచంద్రన్, బృందం

పదిమంది సభ్యులు...

ఈ తోల్‌పావైకూత్తు బృందంలో తనతోపాటు పదిమంది సభ్యులు ఉన్నారని, వారిలో హార్మోనియం కళాకారుడు, మృదంగ కళకారుడు చక్కటి సంగీతాన్ని, విచిత్రమైన ధ్వనులను అందించి ప్రదర్శనను రక్తికట్టించడంలో ఆరితేరారని ముత్తుచంద్రన్ చెప్పారు. ఆ ఇరువురూ వాద్య సంగీతంతో పాటు గాత్ర దానం, పద్యాలు పాడుతూ ప్రేక్షకులను మైమరపిస్తారని చెప్పారు. రామాయణ, భారత, భాగవత గాథలతో పాటు సామాజిక సమస్యలపై కూడా తాము తోలుబొమ్మలాటలను ప్రదర్శిస్తున్నామని చెప్పారు. విద్య ప్రాధాన్యం, నిరుద్యోగ సమస్య, మహిళా భద్రత, ఆరోగ్యం, ఎయిడ్స్, బాలల హక్కులు తదితర అంశాలపై కూడా ఆసక్తికర ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని వివరించారు. దక్షిణ భారత కళలు సంస్కృతీ కేంద్రం ద్వారా తమ బృందం ప్రభుత్వ కార్యక్రమాలు, ఎగ్జిబిషన్లు, సభలలోనూ తోలుబొమ్మలాటను ప్రదర్శిస్తున్నామని చెప్పారు. ఈ తోలుబొమ్మలాటపై స్కూలు, కళాశాల విద్యార్థులకు ఉచితంగా శిక్షణను అందిస్తున్నామని చెప్పారు. ఏదీ ఏమైనా ఈ ప్రాచీన కళను ఆదరించి పోషించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపడుతుందని ముత్తుచంద్రన్ ఆశాభావం వ్యక్తం చేశారు.



బొమ్మలకు వేసిన రంగులను పరిశీలిస్తున్న బృందం

ఘనంగా మియాట్ ఆసుపత్రి రజతోత్సవం

● ప్రత్యేక స్టాంప్ ఆవిష్కరించిన సీఎం



ప్రత్యేక స్టాంప్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం స్టాలిన్, డాక్టర్ మోహన్‌దాస్, డాక్టర్ పృథ్వి మోహన్‌దాస్, మల్లికా మోహన్‌దాస్, మనోజ్

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామాపురంలో ఉన్న 'మియాట్ ఇంటర్నేషనల్ ఆసుపత్రి రజతోత్సవాలు శనివారం సాయంత్రం ఓ హోటల్లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్.. ఈ సందర్భంగా తపాలాశాఖ ప్రత్యేకంగా రూపొందించిన తపాలా బిళ్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపి, వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి పోస్ట్ మాస్టర్ జనరల్ మనోజ్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ ఉత్సవాలకు అధ్యక్షత వహించిన ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పృథ్వీ మోహన్‌దాస్ మాట్లాడుతూ... తన తండ్రి పద్మశ్రీ డాక్టర్ మోహన్ 25 ఏళ్ల క్రితం తన శ్రమనంతా ధారపోసి ఈ ఆసుపత్రిని నిర్మించారని, ఆయన అచంచలమైన కృషి, నిరంతర శ్రమతో 3 వేలమందికి పైగా సిబ్బందితో ఇప్పుడు వేలాదిమందికి వైద్యసేవలందిస్తోందని గుర్తు చేశారు. తన తండ్రి విదేశాల్లో ఉద్యోగం చేసినా, మాతృభూమికి సేవలందించాలన్న తలంపుతో ఇక్కడ ఆసుపత్రి నిర్మించారని, ఆయన బాటలోనే తాను కూడా విదేశాల్లో చదువుకున్నా, సొంతగడ్డపై మమకారంతో ఇక్కడ సేవలందించేందుకు వచ్చానన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను, 70 పడకలతో ప్రారంభమైన ఆసుపత్రి 1000పడకల వరకూ ఎదిగి, 130 దేశాలకు విస్తరించిన వైనాన్ని వివరిస్తూ ప్రత్యేక ఫొటో , వీడియో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ మోహన్ దాస్, చైర్మన్ మల్లికా మోహన్ దాస్, నగరానికి చెందిన పలువురు ప్రముఖులు కూడా హాజరయ్యారు.

వేలూరులో పుస్తక ప్రదర్శన ప్రారంభం





పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్, కలెక్టర్ సుబ్బులక్ష్మి తదితరులు

వేలూరు, ఫిబ్రవరి 17: స్థానిక సేతాజీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ శనివారం ప్రారంభించారు. జిల్లా యంత్రాంగం, ప్రజా గ్రంథాలయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ పుస్తక ప్రదర్శన ఈనెల 27వ తేది వరకు జరుగుతుంది. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రజలు ఈ ప్రదర్శనను వీక్షించవచ్చు. కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు చర్చావేదికలు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలుంటాయి. ఈ ప్రదర్శనలో 80 స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు, ఈ ప్రదర్శనలో పలురకాల పుస్తకాలు ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, అములు విజయన్, జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు, కార్పొరేషన్ మేయర్ సుజాత ఆనందకుమార్, ఉప మేయర్ సునీల్‌కుమార్, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ ఆర్తీ, కార్పొరేషన్ కమిషనర్ జానరి రవీంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవాల్లో అతిథులు, నిర్వాహకులు



ఘనంగా శ్రీ కనకదుర్గ తెలుగు మహోన్నత పాఠశాల వార్షికోత్సవం

ప్యారీస్, ఫిబ్రవరి 17: స్థానిక విల్లివాక్కంలోని శ్రీ కనకదుర్గ తెలుగు మహోన్నత పాఠశాల 77వ వార్షికోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. పాఠశాల ప్రాంగణంలో అఖిల భారత తెలుగు సమాఖ్య, ఎస్‌కేడీటీ పాఠశాలల అధ్యక్షుడు ఆచార్య సీఎంకే రెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర ● సీఎం కిషోర్ నేతృత్వంలో సాగిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా వసంత భవన్ గ్రూప్ చైర్మన్ ఎం.రవి, ఆత్మీయ అతిథులుగా వెండి తెర, బుల్లి తెర నటీమణులు నిషా ఎలిజబెత్, జి.జయశీల, ఎం.హమీదా మురళి పాల్గొని, వివిధ పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేసి అభినందించారు. పాఠశాలలో రిటైర్డ్ కానున్న ఉపాధ్యాయులు టి.సుజాత, డి.కళాసుందరితో పాటు యజమాన్యాన్ని జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యక్షుడు ఎస్.నరసింహులు, కార్యదర్శి టి.శ్రీనివాసరావు, కోశాధికారి శేషగిరిరావు, ఎస్.శ్రీనివాసరావు, హెడ్మాస్టర్ కె.శారా సుహాసిని, అసిస్టెంట్ హెడ్మాసర్ ఎం.మోహననాయుడు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కలిసి పోరాడితేనే లక్ష్యాన్ని సాధించగలం

● తెలుగు సంఘాలకు ఏఐటీఎఫ్ అధ్యక్షుడు సీఎంకే రెడ్డి పిలుపు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఏఐటీఎఫ్ అధ్యక్షులు ఆచార్య సీఎంకే రెడ్డి



సభకు హాజరైన తెలుగు ప్రముఖులు, సంస్థ సభ్యులు

ప్యారీస్, ఫిబ్రవరి 17: రాష్ట్రంలో కనుమరుగవుతున్న తెలుగు భాషను కాపాడేకునేందుకు తెలుగు సంఘాలన్నీ కలిసి పోరాడితేనే లక్ష్యాన్ని సాధించగలమని అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) అధ్యక్షుడు, ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి పిలుపునిచ్చారు. పాడి జంక్షన్‌లోని మోహన్ టవర్స్‌లో శనివారం ఏఐటీఎఫ్ సర్వసభ్య సమావేశం ప్రార్థన, జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. అనంతరం ఇటీవల మరణించిన ఏఐటీఎఫ్ నాయకులకు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. చెన్నై, తిరువళ్లూర్, చెంగల్పట్టు సహా 20కి పైగా జిల్లాలకు చెందిన ఏఐటీఎఫ్ నిర్వాహకులు, పలు తెలుగు సంఘాల నాయకులు హాజరైన ఈ సమావేశం ఆరు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతివ్వాలన్న నిర్ణయాన్ని సంస్థ అధ్యక్షుడు సీఎంకే రెడ్డికి అప్పగిస్తూ, రాష్ట్రంలో కులాలవారీగా భాషల ప్రాతిపదికన నిష్పక్షపాతంగా గణన నిర్వహించాలని, ఏఐటీఎఫ్‌లో సభ్యుల సంఖ్య పెంచేలా అన్ని జిల్లాల నిర్వాహకులు మిస్డ్‌కాల్, ఆన్‌లైన్ ద్వారా మెంబర్‌షిప్ డ్రైవ్ చేపట్టాలని కోరుతూ తీర్మానాలు ప్రతిపాదించారు. ఆ తర్వాత సీఎంకే రెడ్డి ప్రసంగిస్తూ... అమ్మ భాషను కాపాడుకొనేందుకు తెలుగు వారంతా ఏకం కావాలని, అలాగే మాతృభాషలోనే పరీక్షలు రాసేలా శాశ్వత పరిష్కారం కల్పించేలా ఏఐటీఎఫ్ తరఫున చేపట్టిన చర్యలను బలపరిచేలా సమష్టిగా అహింసా మార్గంలో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఆయా ప్రాంతాల్లో నిర్వహిస్తున్న తెలుగు సభల్లో నిండుదనం ఉంటేనే పాలకులు స్పందిస్తారని రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన నిర్వాహకులు డాక్టర్ సీఎం కిషోర్, నాయకర్ నందగోపాల్, వీజీ జయకుమార్, కేవీ జనార్దన్, కుంకు దశరథరావు, గొల్లపల్లి ఇశ్రాయేలు, నేలటూరి విజయకుమార్, నిర్మల్ చందర్, లయన్ జి.మురళి, ఎం.చిట్టిబాబు, డాక్టర్ ఎన్.నాగభూషణం సహా సర్వసభ్య మండలి సభ్యులు పాల్గొన్నారు.